
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
సోమవారం 29 ఏప్రిల్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.147	213	243
సూర్యాపేట	రూ.145	210	240
నల్లగొండ	రూ.149	216	246

ఉష్ణోగ్రత గరిష్ఠం 45.5 । కనిష్ఠం 25.0



దిగుబడి, ధర లేక నిమ్మ రైతు చిత్తు

- దిగుబడి తగ్గాక ధర రూ.3,500
- పంట చేతికొచ్చిన సమయంలో టిక్కీ ధర రూ.1,500
- ఉమ్మడి జిల్లాలో 20వేల ఎకరాల్లో నిమ్మ సాగు

పంట చేతికి వచ్చినప్పుడు ధర లేక, ధర పెరిగాక దిగుబడి లేక నిమ్మ రైతులు ఆదాయాన్ని కోల్పోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 20వేల ఎకరాల్లో రైతులు నిమ్మ తోటలు సాగు చేశారు. అందుకు ఎకరాకు రూ.1,17,6 80 చొప్పున, రూ.235.36కోట్లు పెట్టుబడి పెట్టారు. దిగుబడి బాగుందని ఈ ఏడాది ఆదాయం పొందవచ్చని రైతులు ఆశించగా, పంటచేతికి వచ్చే మార్చి నెలలో ధర తగ్గింది. ఏప్రిల్ మాసంలో ధర పెరిగినా దిగుబడి లేక రైతులు దిగాలు పడ్డారు.

\- కోదాడ

నిమ్మ సాగులో పెట్టుబడులు పెరగడం, రవాణా ఖర్చులు, వ్యాపారుల కమీషన్ల బెడద, దిగుబడి వచ్చే తరుణంలో ధర లేక నిమ్మతోటలు సాగుచేస్తున్న రైతులు ఏటా నష్టపోతున్నారు. పంట దిగుబడి వచ్చిన మార్చి నెలలో నిమ్మకాయలు కిలో రూ.30 ధర ఉంది. దిగుబడి తగ్గగానే ఏప్రిల్ మాసంలో కిలో రూ.70కి ధర పెరిగింది. ధర పెరిగినా దిగుబడి లేకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. వర్షాకాలంలో కిలో నిమ్మ ధర కేవలం రూ.6 మాత్రమే ఉంది. ఆరుగాలం ఎండనక, వాననక కష్టపడినా, పంట చేతికి వచ్చిన సమయంలో ధర లేక పెట్టుబడులు కూడా వెళ్లలేదని, పడ్డ కష్టానికి సరైన ప్రతిఫలం దక్కలేదని రైతులు పేర్కొంటున్నారు. సీజన్‌తో నిమిత్తం లేకుండా కిలో నిమ్మకాయల ధర రూ.45 ఉండేలా ప్రభుత్వం నియంత్రిస్తేనే నష్టపోకుండా ఉంటామని రైతులు వేడుకుంటున్నారు. ఇప్పటికే మద్దతు ధరలేక ఏటా నష్టాలు భరించలేక, రైతులు నిమ్మసాగును తగ్గిస్తూ, ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. ఎకరాకు రైతులు రూ.1,17,680 ఖర్చు చేస్తే, రూ1,44,000 మాత్రమే ఆదాయం వచ్చింది. ఖర్చులు పోగా ఎకరాకు రూ.26వేలు మాత్రమే రైతులకు మిగిలాయి. అంటే నెలకు రూ.2వేల చొప్పున మాత్రమే రైతుకు ఆదాయం లభించింది. ఐదు ఎకరాలు సాగు చేస్తే నెలకు రూ.10వేలు లాభం. ఈ నేపథ్యంలో పెరుగుతున్న నిత్యావసర ధరలతో ఇల్లు గడవడం, పిల్లల చదువులు ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. నిమ్మ రైతులు తోటలను కొనసాగించాలంటే ప్రభు త్వం మార్కెట్‌తో పనిలేకుండా నేరుగా కిలో రూ.45 చొప్పున కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



20వేల ఎకరాల్లో నిమ్మ సాగు



ఉమ్మడి జిల్లాలో రైతులు సుమారు 20వేల ఎకరాలలో నిమ్మతోటలు సాగు చేశారు. ఎకరాకు 80 నిమ్మ మొక్కలు నాటుతారు. నాలుగేళ్ల తరువాత నిమ్మ చెట్టు కాపునకు వస్తుంది. వర్షాకాలంలో ఎండుపుల్ల తీసేందుకు ఒక్కో చెట్టుకు రూ.50, పాదులు తీసేందుకు రూ.60, పైమందులకు రూ.375, సేంద్రీయ ఎరువు, దుక్కి, మందుకు రూ.312, కూలీల రవాణాకు రూ.125, కమీషన్‌దారుడికి రూ.100కు రూ.12, కూలీలకు రూ.125 చొప్పున, నిమ్మకాయల టిక్కీ రవాణాకు రూ.100 మొత్తంగా ఒక నిమ్మచెట్టు కు ఏడాదిలో రూ.1,471 చొప్పున వ్యయం అవుతోంది. ఎకరాకు 80 మొక్కలకు రూ.1,17,680 ఖర్చు వస్తోంది. ఒక చెట్టు వానాకాలంలో 50కిలోలు, వేసవిలో 50 కిలోల (టిక్కీ) మేర దిగుబడి ఇస్తుంది. కాగా, వానాకాలంలో కిలో నిమ్మకాయల ధర రూ.6 ఉండగా, మార్చిలో రూ.30కి పెరిగింది. ఎకరాకు వానాకాలంలో ఒక చెట్టుకు (6 ఏళ్ల వయసు) 50కిలోల టిక్కీ దిగుబడి రాగా, కిలోకు రూ.6 చొప్పున రూ.300 మేర ఆదాయం వచ్చింది. మార్చి వచ్చేటప్పటికీ టిక్కీకి రూ.30 ధర పెరగ్గా, ఆదాయం రూ.1,500 వచ్చింది. మొత్తంగా క్వింటాకు రూ.1,800 ఆదాయం వచ్చింది. ఆ చొప్పున ఎకరాల్లో 80 నిమ్మ చెట్లకు రూ.1,44,000 ఆదాయం వచ్చింది. ఎకరా మొక్కల పెంపకానికి రూ.1,17,680 పోగా రైతుకు రూ.26,320 మాత్రమే మిగిలింది. ఉమ్మడి జిల్లాలో 20వేల ఎకరాల్లో రైతులు నిమ్మ తోటలు సాగు చేయగా, అందుకు రూ.235.36కోట్లు ఖర్చు చేయగా, ఆదాయం మాత్రం రూ.288కోట్లు వచ్చింది. ఖర్చులు పోగా రూ.52.64కోట్లు మిగిలాయి. అంటే ఎకరాకు నెలకు రూ.2,000 మాత్రమే రైతుకు దక్కాయి.

కిలో రూ.45కు కొనుగోలు చేయాలి



సీజన్‌తో పని లేకుండా ప్రభుత్వం కిలో నిమ్మకాయలు రూ.45 కొనుగోలు చేసినప్పుడే రైతుకు లాభం ఉంటుంది. అప్పుడు ఖర్చులు పోగా ఎకరాకు రూ.3లక్షలకు పైబడి ఆదాయం వస్తుంది. ఒక ఏడాది లాభం వచ్చి, ఒక రాకపోయినా ఇబ్బంది ఉండదు. కానీ ఏటా ఖర్చుకు తగ్గట్టు ఆదాయం లేకపోవడంతో నిమ్మ తోటలు సాగు చేయాలనే ఆలోచన రావడం లేదు. బహిరంగ మార్కెట్‌లో ఒక నిమ్మకాయ ధర రూ.10 నుంచి రూ.12 వరకు పలుకుతోంది. ఆ ధర రైతుకు వస్తే సాగువైపు ఉత్సాహంగా మొగ్గుచూపుతారు. డీజిల్, కూలి, మందుల ధరలు, రవాణా ఖర్చులు ఏటా పెరుగుతున్నాయి. వాటికి అనుగుణంగా మార్కెట్‌లో నిమ్మకాయల ధర ఉండం లేదు. ఫలితంగా నిమ్మసాగు వైపు రైతులు మొగ్గుచూపడంలేదు. ఉమ్మడి జిల్లాకు ఒకప్పుడు నిమ్మ సాగులో రాష్ట్రస్థాయిలో పేరు ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏటా 100 నుంచి 150 ఎకరాల్లో రైతుల నిమ్మచెట్లు తొలగించి ఇతర పంటలను సాగుచేస్తున్నారు. కొత్తగా ఎవ్వరూ నిమ్మసాగుకు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకొని మద్దతు ధర కల్పిస్తేనే నిమ్మతోటల మనుగడ ఉంటుంది.

\- షేక్ పెంటుసాహెబ్, నిమ్మరైతు

కాలం అనుకూలించకపోతే అప్పులపాలే



కాలం అనుకూలిస్తే ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30 వేలు వస్తాయి. మంగులాంటి తెగుళ్లు వస్తే పెట్టిన పెట్టుబడులు కూడా రావు. పలు రకాల ఉత్పత్తుల్లో నిమ్మను వాడుతున్న క్రమంలో ప్రభుత్వమే మద్దతు ధర కల్పించి రైతులను ప్రోత్సహించాలి. లేదంటే చివరకు నిమ్మకాయలను సైతం దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఆ పరిస్థితి రాకముందే నిమ్మకాయల కిలో ధర రూ.40 నుంచి రూ.50 ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రైతులు నిమ్మసాగు చేసేలా ప్రోత్సహించాలి.

\- రమణారెడ్డి, నిమ్మ రైతు



ఆర్టీసీ కార్మికులపై పనిభారం

- అదనపు డ్యూటీతో తీవ్ర ఇబ్బందులు
- అనారోగ్యానికి గురవుతున్న ఉద్యోగులు
- ప్రశ్నించిన వారిని టార్గెట్ చేస్తున్న అధికారులు
- తీవ్ర ఆందోళనకు గురవుతున్న ఉద్యోగ, కార్మికులు

ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పనిభారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక పనులతో అనారోగ్యానికి గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. సిబ్బంది కొరతను సాకుగా చూపి అదనపు పనులు అప్పగిస్తున్నారని ఉద్యోగులు గగ్గోలుపెడుతున్నారు. ఇదేంటని ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే టార్గెట్ చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు.

\- నల్లగొండ

నల్లగొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలో నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడ, దేవరకొండ, సూర్యాపేట, యాదగిరిగుట్ట, నార్కట్‌పల్లి డిపోలు ఉన్నాయి. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం 8గంటల వరకు మాత్రమే డ్యూటీ చేయాలి. కానీ, నల్లగొండ రీజియన్‌లో 16 నుంచి 18గంటలు విధుల్లో ఉండే పరిస్థితులు కల్పిస్తుండటంతో ఉద్యోగులు, కార్మికులు అవస్థ పడుతున్నారు. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, ఇతర నగరాలకు వెళ్లి రావాలంటే ఒక్కోసారి అర్ధరాత్రి 1గంట వరకు అవుతోంది. ట్రాఫిక్ కారణంగా అదనంగా డ్యూటీ చేయాల్సి వస్తోందని ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనారోగ్యం పాలవుతున్న కార్మికులు

రాష్ట్రంలో ప్రభుత్వం మారాక తమ జీవితాలు బాగు పడుతాయని ఆర్టీసీ కార్మికులు ఆశ పెట్టుకున్నారు. అయితే ఆర్థిక అంశాల పరిస్థితి ఎలా ఉన్నా పెరిగిన పని భారంతో అష్టకష్టాలు పడుతున్నారు. విధి నిర్వహణలో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో గుండెపోటుకు కూడా గురవుతున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళల ఆదరణకు నోచుకుంది. దీంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య పెరిగి ఉద్యోగులపై పని భారం పెరిగింది. పాత బస్సుల కారణంగా అధిక లోడ్‌తో బస్సులవేగం, మైలేజీ తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. సంస్థ వైఖరిని కార్మిక సంఘాలు, సంక్షేమ మండళ్లు పట్టించుకోకపోవడంతో కార్మికులకు ఎటూ పాలుపోవడం లేదు. కొన్ని డిపోల్లో అధికారులు కార్మికులపై ప్రతాపం చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నల్లగొండ డిపోలో రన్నింగ్ టైమ్‌ను కుదించి అదనంగా ట్రిప్పులు పెంచడంతో ఉద్యోగులు లబోదిబోమంటున్నారు. ఉదయం 5గంటలు లేదా 6గంటలకు డ్రైవర్, కండక్టర్లకు డ్యూటీ మొదలైతే రాత్రి 12గంటలు, అర్ధరాత్రి 2గంటల వరకు విధుల్లో ఉండాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా ఉద్యోగులుసైతం అదనపు సమయంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సెలవుల మంజూరుకు పలు కొర్రీలు



ఆర్టీసీలో ఉన్నతాధికారులు డ్రైవర్లు, కండక్టర్లతో పాటు కార్మికులకు, ఇతర సిబ్బందికి సెలవులు మంజూరు చేయకుండా పలు కొర్రీలు పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మహిళా కండక్టర్లకు సైతం సెలవులు మంజూరు చేయడం లేదని తెలుస్తోంది. సెలవు అవసరమైతే డబుల్ డ్యూటీ చేయాలని నిబంధన పెడుతున్నట్టు వినికిడి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత వేసవిలో 45డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయినా తమపై కనికరం చూపించడం లేదని, అదనపు డ్యూటీలతో సతాయిస్తున్నారని వాపోతున్నారు. కొన్ని డిపోల అధికారులు, సూపర్‌వైజర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా కార్మిక సంఘాలు, సంక్షేమ మండళ్లు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నాయని, ఇక తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఉద్యోగ, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధులు ఆయా డిపోల అధికారులతో చర్చించి అధిక పనిభారాన్ని తగ్గించేలా చూడాలి. అదనపు డ్యూటీలతో నిద్ర కరువై ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. దీంతో డ్రైవర్లతోపాటు బస్సులో ఉండే ప్రయాణికులు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అదనపు పనిభారం తగ్గించాలని కోరుతున్నారు.

అవసరమైన వారికి సెలవులు ఇస్తున్నాం

అవసరం ఉన్న ఉద్యోగులతో పాటు డ్రైవర్లు, కండక్టర్లకు సెలవులు మంజూరు చేస్తున్నాం. ఒకోక్కసారి ట్రాఫిక్ ఉన్నప్పుడు అదనపు సమయం పట్టి బస్సులు ఆలస్యంగా డిపోకు చేరుతున్నాయి. సంస్థ నిబంధనల మేరకు మహిళా కండక్టర్లకు కూడా సెలవులు ఇస్తున్నాం. అదనపు డ్యూటీ చేసిన డ్రైవర్లకు, కండక్టర్లకు స్పెషల్ ఆఫ్ కూడా ఇస్తున్నాం. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా బస్సులు నడపాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత లేదు.

\- రాంమోహన్‌రెడ్డి, నల్లగొండ డీఎం

సరిహద్దులో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలి

ఎన్నికల పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్‌దాస్



గరిడేపల్లిలో పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న కళ్యాణ్‌కుమార్‌దాస్

కోదాడ రూరల్, ఏప్రిల్ 28: సరిహద్దులో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని ఎన్నికల పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్‌దాస్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నందున ఏపీరాష్ట్రంనుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేయాలని పోలీసులను ఆదేశించారు. ఇప్పటి వరకు ఎంత నగదు స్వాధీనం చేసుకున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగదుతో పాటు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులను స్వాధీనం చేసుకున్న వివరాలను తెలుసుకున్నారు. వాటి వివరాలను రికార్డులో నమోదు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ రాష్ట్రం నుంచి వచ్చే వాహ నాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతించాలన్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోతే సీజ్ చేయాలన్నారు. మద్యం కూడా సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున వాటిపై నిఘా పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ సాయిగౌడ్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

నేరేడుచర్ల, గరిడేపల్లి: పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎన్నికల పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ ఆదేశించారు. ఆదివారం నేరేడుచర్ల, గరిడేపల్లి మండలం కేంద్రాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. పోల్ చిట్టీల పంపిణీ, ఓటర్ల నమోదు వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. చిల్లేపల్లి చెక్‌పోస్టును తనిఖీ చేసి ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్లు సైదులు, బండ కవిత, మునిసిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, వీఆర్వో రాంబాబు, బీఎల్‌వోలు ఉన్నారు.

ఆయకట్టును ఎండబెట్టిన అసమర్ధ మంత్రులు

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



రోడ్‌షోలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

నడిగూడెం, ఏప్రిల్ 28: రాష్ట్రం ఏర్పడి అనేక కష్టనష్టాలు పడి రైతాంగాన్ని ఆదుకుంటే కాంగ్రెస్ అసమర్థ ప్రభుత్వం రైతులను, ప్రజలను ఆదుకోలేకపోయిందని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ నడిగూడెంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సాగర్ నీటిని 18 పంటలకు ఇచ్చి రైతులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాపాడుకుంటే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెరువులను, పంటలను ఎండబెట్టిందన్నారు. షాదీముబారక్, కల్యాణ లక్ష్మి, పెన్షన్లు పెంచి ఇస్తామని అధికారంలోకి వచ్చి వాటిని మరచిపోయారన్నారు. జిల్లాలోని ప్రాజెక్టులన్నింటిని ఎండబెట్టారని, తెలిసో తెలియకో కాంగ్రెస్‌కు ఓటు వేశారని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారన్నారు. ఇకనైనా మేల్కొని బీఆర్‌ఎస్‌ను ఆదరించి, కేసీఆర్ నాయకత్వంలో సమస్యలపై ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. పార్లమెంటు అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ, తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రజా సమస్యలపై పోరాడతానన్నారు. కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, ఎంపీపీ యాతాకుల జ్యోతి, పార్టీ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మారుతి ఉపేందర్, దున్నా సుధాకర్, ఆనంతుల మహేష్, గంగారాజు, తదితరులు పాల్గొన్నారు.

పాతాళగంగ కోసం అన్వేషణ



- అశాస్త్రీయ పద్ధతిలో బోరుపాయింట్ల గుర్తింపు
- తవ్వకాలు చేయించి నష్టపోతున్న రైతులు
- ఏడాదిగా సాగర్ ఆయకట్టులో గడ్డుపరిస్థితులు
- గణనీయంగా పడిపోయిన భూగర్భజలాలు
- సాగునీటికోసం భగీరథ యత్నాలు

కాలు అడ్డంపెడితే సాగునీరు ప్రవహించే సాగర్ ఆయకట్టుపై కరువు ఛాయలు కమ్ముకున్నాయి. గడిచిన ఏడాదికాలంగా కర్షకులు సాగునీటి కోసం పడరాని పాట్లుపడుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడ్డ తీవ్ర వర్షాభావ పరిస్థితులు ధాన్యపు సిరులు కుమ్మరించే సాగర్ ఆయకట్టును ఎడారిగా మార్చేశాయి. రెండు దశాబ్దాల క్రితం రైతులు తవ్వుకున్న బోరుబావుల ఆధారంగా వరిసాగైతే, సాగర్ ప్రాజెక్టు నీటిపై ఆధారపడ్డ భూములన్నీ గత వానాకాలం, యాసంగి సీజన్లలో పడావుపడ్డాయి. దీంతో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది.

\- మిర్యాలగూడ అర్బన్

వర్షాభావ పరిస్థితులతో ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలు గణనీయంగా పడిపోయాయి. దీంతో బోరుబావులకు నీరందక పొట్టదశలోనే వందలాది ఎకరాల్లో వరిపైరు నిలువునా ఎండిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఈ గడ్డుపరిస్థితులను అధిగమించేందుకు రైతులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిపెట్టారు.పాతాళగంగను బయటికి తెచ్చుకునేందుకు అన్వేషణ మొదలుపెట్టారు. ప్రభుత్వపరంగా జియాలజికల్ సర్వేకు మోక్షం దక్కకపోవడంతో జలధారలు గుర్తించేందుకు అశాస్త్రీయ మార్గాలను ఎంచుకుంటున్నారు.కొబ్బరికాయ,తంగేడుపుల్ల, నిమ్మకాయ, కోడిగుడ్డుతో భూగర్భజలాలను గుర్తించి బోరుపాయింట్లు నిర్ధారిస్తున్నారు. గ్రామాల్లో ఒకటి, రెండుచోట్ల నిర్ధారించిన బోరుపాయింట్లు సఫలీకృతం కావడంతో ఈ మార్గాన్ని రైతులు ఎంచుకుంటున్నారు.దీంతో అశాస్త్రీయపద్ధతిలో బోరుపాయింట్లను గుర్తించేందుకు కొందరు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. రైతులఅమాయకత్వం, అవసరాన్ని వారు సొమ్ముచేసుకుంటున్నారు. వ్యవసాయ భూమిలో కలియదిరిగి బోరుపాయింట్ నిర్ధారించేందుకు రూ.2వేల నుంచి రూ.3వేలవరకు డిమాండ్ చేస్తున్నారు. భూగర్భజలాలను బయటకు తెచ్చేందుకు పలుమార్లు చేసిన ప్రయత్నాలు విఫలమైన రైతులు విధిలేని పరిస్థితిలో మూఢ విశ్వాసానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

రిగ్గులకు భలే డిమాండ్

సకాలంలో వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టుల్లోకి వరద చేరడంలేదు. వాగులు, వంకలు పొంగిపొర్లి చెరువులు, కుంటలు నిండడం లేదు. దీంతో సాగునీటి ఇబ్బందులు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఫలితంగా బోరుబావుల డ్రిల్లింగ్ యంత్రాలకు డిమాండ్ ఏర్పడింది. సాగునీటి కోసం సాగర్ ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతాల రైతులతోపాటు తాగునీటి కోసం పట్టణవాసులు బోరుబావులు తవ్విస్తున్నారు. దీంతో రిగ్గుల వినియోగం పెరగడంతో వాటి యజమానులు అమాంతం ధర పెంచేశారు. వానాకాలం సీజన్‌లో ఒక ఫీట్ డ్రిల్లింగ్‌కు రూ.110 వసూలు చేయగా, ప్రస్తుతం రూ.140కు పెంచారు. అదేవిధంగా 6ఇంచులకేసింగ్ ధరను రూ.280 నుంచి రూ.350కు, 8 ఇంచుల కేసింగ్ ధరను రూ.600 నుంచి రూ.750కి పెంచారు. వర్షాలు కురిస్తే ఈ యంత్రాలు పొలాల్లో తిరగడం కష్టమవుతుందని భావిస్తున్న రైతులు ప్రస్తుతం బోరుబావులు తవ్వించేందుకు పోటీపడుతున్నారు. రైతుల అవసరాన్ని అదునుగా తీసుకొని రిగ్గుల యజమానులు ధరలను పెంచి వసూలు చేస్తున్నారు. నాలా నిబంధనలను అతిక్రమించి బోరుబావులను తవ్వుతూ రైతుల మధ్య వివాదాలకు కారణమవుతున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

రెండెకరాల కోసం 20 బోర్లు తవ్వించా



సాగర్ జలాశయం నుంచి ఏడాదిగా సాగునీటి విడుదల లేక ఉన్న సాగుభూమి పడావుపడింది. కాలం అయినా.. కాకపోయినా పొలాన్ని సాగులోకి తెచ్చేందుకు బోరుబావి ఉండాలని భావించా. మెట్టప్రాంతంలో నాకున్న రెండెకరాల భూమిని సాగులోకి తేవాలన్న ఆశతో బోరుబావిని తవ్వించేందుకు సిద్ధపడ్డా. కొబ్బరికాయతో జలాలు గుర్తించే వ్యక్తిని తీసుకొచ్చి బోరుపాయింట్లు పెట్టి సుమారు రూ.2.50లక్షలు ఖర్చుచేసి 20 బోరు బావులు తవ్వించినా చుక్కనీరు రాలేదు. సాగర్ ఆయకట్టులో భూగర్భ జలాలు ఇంతగా ఇంకిపోవడం ఇప్పుడే చూస్తున్నా. భూగర్భజలాల స్థాయిని గుర్తించేందుకు అధికారులు సర్వే నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

\- పుట్టల వెంకన్న, రైతు, వేములపల్లి

అప్పుల ఊబిలోకి రైతులు

పంటలు పండక, చేతిలో చిల్లిగవ్వలేని రైతులు పడావుపడ్డ భూములను సాగులోకి తెచ్చేందుకు బోరుబావుల తవ్వకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కొబ్బరికాయ, నిమ్మకాయలు, కోడిగుడ్డు, తంగేడు పుల్లలతో నిర్ధారించిన ప్రాంతంలో బోరుబావులు తవ్వించినా చుక్కనీరు బయటకు రావడం లేదు. ఇష్టారీతిగా తవ్వకాలు జరిపి వేలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారు. కొందరు రైతులు స్థోమతకు మించి బోరుబావుల కోసం ఖర్చుచేస్తూ అప్పుల ఊబిలోకి వెళ్తున్నారు. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు సాగునీటికోసం భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు సైతం ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తూ వేలాది రూపాయలు ఖర్చుచేసి ఆర్థికంగా చితికిపోతున్నారు. సాధారణంగా సాగర్ ఆయకట్టు భూముల్లో 50 నుంచి 80 ఫీట్ల మధ్యలో జల లభ్యత ఉండేది. ప్రస్తుత పరిస్థితుల్లో 120 నుంచి 180 అడుగుల వరకు తవ్వకాలు జరిపినా ఫలితం దక్కడంలేదు.

'సన్'డే 45.5 డిగ్రీలు | నల్లగొండ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు | •7లో..

హోరాహోరీగా ఎడ్ల పందేలు

తిలకించేందుకు తరలివచ్చిన తెలుగు రాష్ట్రాల ప్రజలు



ఆరు పండ్ల విభాగంలో తలపడుతున్న గిత్తలు

మఠంపల్లి, ఏప్రిల్ 28: మండల కేంద్రంలోని శుభవార్త చర్చి వార్షికోత్సవం సందర్భంగా స్థానిక శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం జరిగిన పోటీల్లో మొత్తం 10జతలు పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల ప్రజలు తరలివచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి తాగునీరు, వసతి, భోజన సదుపాయాలను కల్పించినట్టు, ఎండ తీవ్రత దృష్ట్యా సాయంత్రం 6గంటల నుంచి అర్ధరాత్రి వరకు పోటీలు నిర్వహిస్తున్నట్టు యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభరత్‌రెడ్డి తెలిపారు. కాగా, పోటీలను తిలకించేందుకు రెండు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలిరావడంతో వీవీ.మైదానం కోలాహలంగా మారింది. కార్యక్రమంలో ఫాదర్ వినోద్‌రెడ్డి, ఆధూరి మధుసూదన్‌రెడ్డి, శౌరెడ్డి, బాల్‌రెడ్డి, కె.చిన్నపురెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలశౌరెడ్డి, గాదె పవన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సిస్టర్ రూబీ, సుజాత, అలం బాల్‌రెడ్డి, అంథోనిరెడ్డి, లూర్ధురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరు పండ్ల విభాగంలో మఠంపల్లి గిత్తలకు ప్రథమస్థానం

తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేల్లో ఆరు పండ్ల విభాగంలో మండల కేంద్రానికి చెందిన తుమ్మా కిరణ్‌కుమార్‌రెడ్డి గిత్తలు 3319.7 అడుగులు లాగి ప్రథమ బహుమతి గెలుచుకున్నాయి. ఏపీ రాష్ట్రం కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, తెంపల్లికి చెందిన గుడిబండి వెంకటరెడ్డి, జొన్నలగడ్డ గిత్తలు రెండో బహుమతి, పామర్రుకు చెందిన గుంటూరు బలికోటయ్యగిత్తలు మూడో బహుమతి, మఠంపల్లికి చెందిన గాదె ఆశీర్‌రెడ్డి, సుమన్విరెడ్డికి చెందిన గిత్తలు నాలుగో బహుమతి గెలుచుకున్నాయి.ప్రకాశం జిల్లా, ముండ్లమూరు మండలం, మర్కేనవారిపాలెంకు చెందిన గోడుగూలురి రామయ్య గిత్తలు ఐదో బహుమతి, గుంటూరు జిల్లా,పెదకాకాని మండలానికి చెందిన మంచికలపూడి పద్మావతి గిత్తలు ఆరో బహుమతి, నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం, నడికుడకు చెందిన రఘుగౌడ్ గిత్తలు ఏడో బహుమతి గెలుచుకున్నాయి.



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు


ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

త్రుటిలో తప్పిన ప్రమాదం

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 28: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలో.. కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై త్రుటిలో ప్రమాదం తప్పింది. దేవరకొండ నుంచి ఆటోలో మాచర్లలో జరిగే జాతరలో చిరు సామగ్రి విక్రయించేందుకు నలుగురు వెళ్తున్నారు. ఈ క్రమంలో కొండమల్లేపల్లి దాటగానే చిన్నఅడిశర్లపల్లి సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

పురుగు మందు డబ్బాతో
పోలీస్‌స్టేషన్‌కు దంపతులు

● తమ కోడలిపై కేసు నమోదు చేయాలని డిమాండ్
● రూ.50వేలు దొంగిలించిందని ఆరోపణ

మునగాల, ఏప్రిల్ 28: ఇంట్లో పెట్టిన రూ.50వేలను కోడలు, ఆమె తమ్ముడు దొంగిలించారని ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవటంలేదని ఆవేదన చెందిన దంపతులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో పురుగుల మందుతో ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన దామెర వెంకటమ్మ, భర్త కృష్ణయ్యలు.. గత మూడు నెలల క్రితం ఇంట్లో పెట్టిన డబ్బులను తమ కోడలు సంధ్య, ఆమె తమ్ముడు రాజేశ్ దొంగిలించారని ఆరోపించారు. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్ చుట్టూ మూడు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోకపోగా, తమ కోడలు తమ తర్వాత గృహహింసపై ఇచ్చిన ఫిర్యాదు తీసుకొని ఈ నెల 27వ తేదీన తమపై కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కోడలు కౌంటర్ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారని, తమ ఇంట్లో డబ్బులు పోయాయని ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడంలేదని, అంతేకాక ఎస్ఐ డబ్బులు ఇస్తే కేసు నమోదు చేస్తానని బెదిరించారని ఆరోపించారు. తమకు గత్యంతరంలేక ఎస్పీ రాహుల్ హెగ్డేను గత నెల కలిసి ఫిర్యాదు చేశామన్నారు. అయినా పట్టించుకోవటం లేదని, నిరాశ చెంది చావే శరణ్యమని పురుగుల మందుతో భార్యాభర్తలం స్టేషన్‌కు వచ్చామన్నారు. ఈ విషయంపై సీఐ రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా వెంటనే కోడలిపై ఎఫ్ఐఆర్ చేస్తామని, ఎస్ఐ పై విచారణ చేస్తామన్నారు. ఇదిలా ఉంటే గతంలో కోడలు, కొడుకు మధ్య వివాదం విషయంపై కోర్టులో కేసు నడుస్తుంది. ఇదిలా ఉంటే దంపతులిద్దరూ వ్యవసాయ కూలీలుగా పనిచేసుకుంటూ జీవనం గడుపుతున్నారు.

చరిత్ర సిగలో 'మిర్యాలగూడ'

నల్లగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 47 ఏళ్ల మనుగడలో ఉన్న మిర్యాలగూడ లోకసభ నియోజకవర్గం పలు ప్రత్యేకతలు సంతరించుకుంది. 1962లో ఏర్పాటైన ఈ నియోజకవర్గం 2009 వరకు కొనసాగింది. 2008లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన లో ఈ నియోజకవర్గం రద్దయింది. ఈ లోక్‌సభస్థానం పరిధిలోని రామన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం సైతం రద్దయిపోగా, నూతనంగా హుజూర్‌నగర్ ఆవిర్భవించింది. మిర్యాలగూడ లోకసభ స్థానం కొనసాగినప్పుడు దీని పరిధిలో మిర్యాలగూడ, నకిరేకల్, రామన్నపేట, చలకుర్తి, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలుండేవి. ఈ పార్లమెంట్ నియోజకవర్గం రద్దయ్యాక ఉమ్మడి జిల్లాలో నల్లగొండతోపాటు నూతనంగా భువనగిరి లోకసభ స్థానం ఏర్పాటు చేశారు. రద్దయిన మిర్యాలగూడ లోకసభ స్థానం పరిధిలోని ప్రాంతాల్లో అత్యధికంగా నల్లగొండ లోక్‌సభ పరిధిలోకి వస్తే, కొన్ని ప్రాంతాలు భువనగిరి లోకసభ పరిధిలోకి వెళ్లాయి.



సం.	గెలిచిన అభ్యర్థి	పార్టీ
1962	లక్ష్మీదాస్	సీపీఐ
1967	గోపు శౌరిరెడ్డి	కాంగ్రెస్
1971	భీంరెడ్డి నర్సింహారెడ్డి	సీపీఎం
1977	గోపు శౌరిరెడ్డి	కాంగ్రెస్
1980	గోపు శౌరిరెడ్డి	కాంగ్రెస్
1984	భీంరెడ్డి నర్సింహారెడ్డి	సీపీఎం
1989	బద్దం నర్సింహారెడ్డి	కాంగ్రెస్
1991	భీంరెడ్డి నర్సింహారెడ్డి	సీపీఎం
1996	బద్దం నర్సింహారెడ్డి	కాంగ్రెస్
1998	బద్దం నర్సింహారెడ్డి	కాంగ్రెస్
1999	సూదిని జైపాల్‌రెడ్డి	కాంగ్రెస్
2004	సూదిని జైపాల్‌రెడ్డి	కాంగ్రెస్

చైతన్యానికి మారుపేరు

అభివృద్ధి, చైతన్యానికి మారుపేరు ఈ లోక్‌సభ నియోజకవర్గం. ఎక్కువ ప్రాంతాలకు నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరందేది. ఉమ్మడి జిల్లాలోని సాగర్ ఆయకట్టు ప్రాంతం అంతా ఈ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనే ఉండేది. వరిసాగు ఎక్కువగా ఉండడంతో మిర్యాలగూడ, హుజూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో భారీరైస్ మిల్లులు, ఈ ప్రాంతంలోనే సున్నపురాయి గనులుండడంతో సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. దీంతో ఈ పార్లమెంట్ నియోజకవర్గ రైతాంగం, కార్మికులు, వ్యాపారులకు ఆలవాలంగా ఉండి, ఆయా రంగాలు విస్తరించడంతో ఈ ప్రాంతం అభివృద్ధికి సూచికగా ఉండేది. మరోవైపు నిజాం సర్కారుపై వీరోచితంగా పోరాడిన కమ్యూనిస్టులకి పురిటిగడ్డ అయిన సూర్యాపేట తాలూకా కూడా ఈ లోక్‌సభ పరిధిలోనే ఉండేది. దీంతో మొత్తం లోకసభ నియోజకవర్గ ప్రాంతం అభివృద్ధికి, చైతన్యానికి మారుపేరుగా నిలిచింది.

1962లో ఏర్పాటైన మిర్యాలగూడ నియోజకవర్గం

1962లో ఏర్పాటైన మిర్యాలగూడ లోక్‌సభ నియోజకవర్గం 2009 వరకు మనుగడలో ఉంది. ఈ నియోజకవర్గానికి 12 పర్యాయాలు ఎన్నికలు జరిగితే, ఎనిమిది సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే, మూడు సార్లు సీపీఎం, ఒక్కసారి సీపీఐ అభ్యర్థి గెలుపొందారు. మొత్తం 47 ఏళ్లలో 26 ఏళ్లు కాంగ్రెస్ ఎంపీలు కొనసాగితే, 16 ఏళ్లు సీపీఎం, ఐదేళ్లు సీపీఐ ఎంపీలు ప్రాతినిధ్యం వహించారు. మొత్తం 47 ఏళ్లలో ఐదుగురు ఎంపీలుగా ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. సీపీఎం నుంచి భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి, సీపీఐ నుంచి లక్ష్మీదాస్ గెలిస్తే, కాంగ్రెస్ నుంచి గోపుశౌరిరెడ్డి, బద్దం నరసింహారెడ్డి, సూదిని జైపాల్‌రెడ్డి గెలిచారు.

16 సార్లు ఎంపీగా పనిచేసిన భీంరెడ్డి

సీపీఎం తరఫున ఈ నియోజకవర్గంలో మూడుసార్లు గెలుపొందిన భీంరెడ్డి నరసింహారెడ్డి మొత్తం 16ఏళ్లు ఎంపీగా కొనసాగారు. ఈ నియోజకవర్గంలో అత్యధికకాలం ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన నేతగా రికార్డ్ కూడా ఆయనదే. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చెగువేరాగా పేరొందిన బీఎన్‌రెడ్డి ఈ నియోజకవర్గంపై చెరగని ముద్ర వేశారు. ఇక్కడి రైతాంగ పోరాటాలకు, ట్రేడ్ యూనియన్ ఉద్యమాలకు ఆయన స్ఫూర్తినిచ్చారు. 1999లో ఆయన సీపీఎంని విబేధించి సీపీఎం(బీఎన్) పార్టీని స్థాపించినప్పుడు ఆ పార్టీ నుంచి బరిలో నిలిచిన ఈ రాంచంద్రంనాయక్‌కి కూడా గణనీయమైన ఓట్లు రావడం ఈ ప్రాంతంపై బీఎన్ వేసిన ముద్రకి నిదర్శనంగా భావించారు.

కేంద్ర మంత్రిగా సూదిని జైపాల్ రెడ్డి

ఈ నియోజకవర్గం నుంచి 1999, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి జాతీయనేత సూదిని జైపాల్‌రెడ్డి గెలుపొందారు. 2004లో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జైపాల్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మాడుగులకి చెందిన జైపాలరెడ్డి పొరుగు జిల్లాకి వచ్చి ఎంపీగా గెలవడం అప్పట్లో విశేషం. అయితే ఈ నియోజకవర్గ ఏర్పాటైన మొదటిసారి 1942లో కూడా ఇక్కడ ప్రముఖ కార్మిక, ఉద్యోగ సంఘాల నేతగా పేరొందిన హైదరాబాద్‌కి చెందిన సీపీఐ నేత లక్ష్మీదాస్ గెలుపొందారు

మూడు సార్లు గెలిచినా మధ్యంతరమే

ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన బద్దం నరసింహారెడ్డి మూడుసార్లు గెలుపొందారు. అయితే ఆయన గెలిచిన మూడు పర్యాయాలు లోక్‌సభ మధ్యంతరంగా రద్దవడంతో ఆయన కేవలం ఐదేళ్లే ఎంపీగా కొనసాగాల్సి వచ్చింది. మరో ఎంపీ గోపుశౌరిరెడ్డి మూడుసార్లు గెలిస్తే ఒక పర్యాయం నాలుగేళ్లు, మరో సారి మూడేళ్లు, ఇంకోసారి నాలుగేళ్లు ప్రాతినిధ్యం వహించారు.

సన్‌డే.. 45.5 డిగ్రీలు

నల్లగొండ, ఏప్రిల్ 28: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సూర్యుడు అగ్నిగోళంలా మారాడు. జిల్లాలో సగటున 45.5డిగ్రీలు నమోదు కావడం మొదటిసారి కాగా మండలాల వారీగా పరిశీలిస్తే ఆరు మండలాల్లో 45డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదు కావడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడమేతప్ప తగ్గకపోవడంతో ప్రజలే కాకుండా పశుపక్ష్యాదులు కూడా అల్లాడుతున్నాయి. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా మాడ్గులపల్లిలో 45.4 డిగ్రీలు, అదే విధంగా దామరచర్ల మండలం తిమ్మాపూర్‌లో 45.2 డిగ్రీలు, త్రిపురారం, కట్టంగూరు, హాలియా, నాంపల్లి మండలాల్లో 45.1 డిగ్రీలు, అత్యల్పంగా చింతపల్లి మండలం గొడకండ్లలో 39.9 డిగ్రీలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 44.6 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తిలో 41.2 డిగ్రీలు, యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాలలో అత్యధికంగా 44.4 డిగ్రీలు, ఆలేరు మండలం షారాజీపేటలో అత్యల్పంగా 40.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదగిరిక్షేత్రంలో భక్తులు ఎండవేడిమి తట్టుకోలేక పరుగులు తీయడం కన్పించింది. దర్శనానికి వెళ్లే ముందు, దర్శనం అనంతరం ఆలయ తిరుమాడవీధుల్లో భక్తులు కాలి నడకన వెళ్లేందుకు ఇబ్బందిపడ్డారు.



నల్లగొండ మండలంలో ఎండ వేడిమికి మృత్యువాతపడిన చేపలు

వడదెబ్బతో వృద్ధుడు మృతి

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ అంబేడ్కర్ కాలనీకి చెందిన దార అంజయ్య (75) వడదెబ్బతో ఆదివారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన అంజయ్య వారంరోజులుగా వడదెబ్బ తగిలి జ్వరంతో ఇబ్బంది పడుతుండగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహానికి పలు పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దేశంలోనే అత్యధిక మెజార్టీ 'రావి' సొంతం

భువనగిరి రూరల్, ఏప్రిల్ 28: తొలి సార్వత్రిక ఎన్నికల్లో జవహర్‌లాల్ నెహ్రూ కంటే అత్యధిక ఓట్లు దక్కించుకున్న రావి నారాయణరెడ్డిని ఉమ్మడి జిల్లావాసులు గుర్తు చేసుకుంటున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ బిడ్డ రావి నారాయణరెడ్డి, స్వాతంత్ర్యం అనంతరం 1951-52లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొన్న రావి నారాయణరెడ్డి అప్పట్లో నల్లగొండ పార్లమెంట్ స్థానంనుంచి పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థిగా బరిలోకి దిగి 3,09,162 ఓట్లు సాధించారు. ఆయన సమీప అభ్యర్థి వి.భాస్కర్‌రావు (కాంగ్రెస్)కు 86,882 ఓట్లు వచ్చాయి. అయితే రావి నారాయణరెడ్డికి 2,22,280 ఓట్ల మెజార్టీ దక్కింది. ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్ నుంచి పోటీ చేసిన జవహర్‌లాల్ నెహ్రూకు 2,33,571 ఓట్లు వచ్చాయి. ఆయన సమీప ప్రత్యర్థి కేఎంపీపీ పార్టీకి చెందిన బన్సిలాల్‌కు 59,602 ఓట్లు వచ్చాయి. నెహ్రూకు 1,73,929 ఓట్లు మెజార్టీ వచ్చింది. దీంతో నెహ్రూ చొరవతో అత్యధిక ఓట్లు సాధించిన ఈ ప్రాంత వాసి రావి నారాయణరెడ్డి చేతులమీదుగా పార్లమెంట్ భవనాన్ని ప్రారంభింపజేశారు. అయితే జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో కేంద్రంలో అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.



రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహ నమూనా



గిరిజన సంక్షేమం కోసం బరిలో నిలిచా : సుమన్

● మల్కాజ్‌గిరి ఎంపీ ఎన్నికల బరిలో మఠంపల్లివాసి

మఠంపల్లి, ఏప్రిల్ 28: గిరిజన సంక్షేమం కోసం మల్కాజ్‌గిరి ఎంపీ ఎన్నికల బరిలో నిలిచినట్లు మఠంపల్లి మండలం, మంచ్యాతండాకు చెందిన సపావత్ సుమన్‌నాయక్ తెలిపారు. హైదరాబాదులోని మల్కాజ్‌గిరి నుంచి స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు తెలిపారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పాలకులు గిరిజనులను అణగతొక్కేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకొని, మఠంపల్లి మండలంలోని పెదవీడు రెవెన్యూలోని సర్వే నెం.540లో గల 2,500 ఎకరాలు అన్యాక్రాంతం కాకుండా ఉద్యమించినట్లు తెలిపారు. గత రెండుసార్లు హుజూర్‌నగర్ శాసనసభ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన అనుభవంతో మాల్కజ్‌గిరి నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడంలో రాజకీయ ఉద్దేశంలేదని, పార్లమెంట్‌లో గిరిజనుల గొంతు వినిపించడం కోసమేనన్నారు.

కాంగ్రెస్‌తోనే పేద ప్రజల అభివృద్ధి



దామరచర్లలో మాట్లాడుతున్న జానారెడ్డి, పక్కన అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

● మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 28: కాంగ్రెస్‌తోనే పేదల బతుకులు మారి అభివృద్ధి చెందుతారని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మాట్లాడారు. ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుచేసిందని గుర్తు చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప బీఆర్ఎస్ పార్టీ పేదల అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, నాయకులు ధీరావత్ స్కైలాబ్ నాయక్, రమావత్ బాలునాయక్, కూరాకుల చినరామయ్య, నాగేశ్వర్‌రావు, నరసింహారావు, హనుమంతు పాల్గొన్నారు.

దామరచర్ల: ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం, దామరచర్ల గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ప్రచారంలో ఆయన సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పేదల ప్రభుత్వం ఉందన్నారు. ఎమ్మెల్యే సహకారంతో ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానన్నారు. దామరచర్ల రైల్వేస్టేషన్ పునరుద్ధరణతో పాటు వృత్తి నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి కల్పించేందుకు పెద్దపీట వేస్తామన్నారు. అనంతరం సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు 64లక్షల మంది రైతులకు రైతుబంధు ద్వారా లబ్ధి చేసిందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ, రాష్ట్ర నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, ఎంపీపీ నందినిరవితేజ, మాజీ సర్పంచులు బంటు కిరణ్, చల్లా అంజిరెడ్డి, నాయకులు గాలం వెంకన్న, షేక్ గని, అన్నెం కరుణాకర్‌రెడ్డి, ఓర్సు వెంకటేశ్వర్లు, మన్నెం నాగయ్య పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

● యాదగిరికొండపై భక్తుల కోలాహలం ● నిత్య ఆదాయం రూ.59.34లక్షలు





నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, షెడ్డు కింద భక్తుల రద్దీ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 28: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి ఆదివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అనుబంధ పాతగుట్ట స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రివేళ మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వార బంధనం చేశారు.

యాదగిరికొండపై భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తులతో యాదగిరికొండపై కోలాహలం నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు ఇష్టదైవాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ధర్మదర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయం, ప్రసాద విక్రయశాలల్లో వద్ద కూడా రద్దీ నెలకొంది. సుమారు 40వేల మంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.59,34,193 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

బొడ్రాయి పండుగపూట విషాదం

విద్యుదాఘాతంతో మహిళ మృతి

దేవరకొండ, ఏప్రిల్ 28: బొడ్రాయి పండగ పూట విషాదం నెలకొంది. విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన దేవరకొండ మండలం శేరిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా యాచారంనకు చెందిన బొమ్మనబోయిన ధనలక్ష్మి(32) తన సోదరి జక్కుల అలివేలు దేవరకొండ మండలం శేరిపల్లిలో బొడ్రాయి పండగ వేడుకలు ఉన్నాయని చెప్పగా ఈ నెల 26న వచ్చింది. వేడుకల అనంతరం శనివారం సాయంత్రం ధనలక్ష్మి ఇంటి ఆరుబయట బట్టలు ఆరేస్తుండగా జేవైరు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. లక్ష్మీ సోదరి అలివేలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

గరిడేపల్లి: కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో మహిళ మృతి చెంది, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండలంలోని పొనుగోడులో జరిగింది. ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం ఖుతుబ్‌షాపురం గ్రామానికి చెందిన గడ్డం వెంకటమ్మ(49), ఆమె సోదరుడు చింతల భద్రయ్య ఇరువురు కలిసి ద్విచక్రవాహనంపై నేరేడుచర్ల మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన బంధువుల ఇంట్లో వివాహ కార్యక్రమానికి వెళ్లుతున్న క్రమంలో మార్గంమధ్యలోని పొనుగోడ గ్రామశివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకొని బయటికి వస్తుండగా గరిడేపల్లి వైపు నుంచి సూర్యాపేట వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న భద్రయ్యకు, గడ్డం వెంకటమ్మకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్సనిమిత్తం హైదరాబాద్ తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో గడ్డం వెంకటమ్మ మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు. భద్రయ్యను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మృతురాలి భర్త గడ్డం అచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. వెంకటమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి..

అడవిదేవులపల్లి: బైక్ అదుపుతప్పి కిందపడిపోగా తీవ్ర గాయాలపాలైన వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం చిట్యాల గ్రామ శివారులో ఆదివారం జరిగింది. ఎస్ఐ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన గువ్వల పెదసైదయ్య(55) ఆదివారం మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో తన బంధువు వివాహ వేడుకకు హాజరై తిరిగి తన బైక్‌పై వెళ్తుండగా చిట్యాల గ్రామశివారులోకి రాగానే ఒక్కసారిగా బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు బాలసైదయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా సైదయ్యకు భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పోలీసుల తనిఖీలో రూ. 1.16లక్షల పట్టివేత

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 28: ఎన్నికల కోడ్ నిబంధనల అమల్లో భాగంగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్ రహదారిపై ఆదివారం చేపట్టిన వాహన తనిఖీలో ఓ వ్యక్తి నుంచి రూ.1.16లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన శ్రీనివాసరెడ్డి ఎలాంటి ఆధారాలు లేకుండా తన వాహనంలో తరలిస్తున్న నగదును పట్టుకున్నట్లు సీఐ నాగార్జున తెలిపారు. అదేవిధంగా దామరచర్ల వైపు నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో గుట్ట స్వామి తరలిస్తున్న 140 గ్యాస్ స్టవ్‌లను స్వాధీనం చేసుకొని జిల్లా ట్రెజరీ కార్యాలయానికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకుంటున్న నగదు

మతోన్మాద శక్తులకు బుద్ధి చెప్పాలి

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోకినేపల్లి వెంకటేశ్వరరావు ● పలు మండలాల్లో సీపీఎం సమావేశాలు

నేరేడుచర్ల: మేళ్లచెర్వు, మఠంపల్లి, పాలకవీడు, ఏప్రిల్ 28: మతోన్మాద బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ ఫాసిస్టు శక్తులను పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోకినేపల్లి వెంకటేశ్వరావు అన్నారు. ఆదివారం నేరేడుచర్లలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 10ఏళ్ల నుంచి దేశాన్ని పాలిస్తున్న బీజేపీ, హిందూ రాజ్యంగా మార్చాలని చూస్తోందని, దేశ సంపదను ఆదాని, అంబానీలు దోచుకునేందుకు అవకాశం కల్పించిందని, ప్రజా సమస్యలను పరిష్కరించలేక ప్రజల మధ్య మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని ఆరోపించారు. ప్రజావ్యతిరేక ప్రభుత్వం బీజేపీని ఓడించాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య, కారింగుల వెంకన్న, లక్ష్మయ్య, మారసాని చంద్రకళ, సూరం రేణుక, జయమ్మ, వాసా కరుణాకర్, ఎర్రమల్ల శ్రీను, పిడమర్తి లింగయ్య, పరశురాం, పావని, సత్తెమ్మ, లక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.



మేళ్లచెర్వులో మాట్లాడుతున్న మల్లు వెంకట్‌రెడ్డి

● ఇండియా కూటమి ఐక్యంగా ఉండి, పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని ఓడించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లు వెంకట్‌రెడ్డి అన్నారు. మేళ్లచెర్వులో నిర్వహించిన సీపీఎం, ప్రజాసంఘాల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈ పదేళ్ల కాలం నుంచి కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను, మతతత్వ విధానా లను అవలంబిస్తోందని, కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేసిందని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని, విపక్షాలన్నీ ఐక్యంగా పోరాడి బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో లోపాయకార ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. అచ్యుత్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు, సీపీఎం నాయకులు గుండు సైదులు, బాలాజీనాయక్, భావన ఆదినారాయణ, అశోక్, ప్రకాష్, పద్మారావు, భిక్షపతిరావు, సైదులు, ఆనంద్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచర్లలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

● ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్ పిలుపునిచ్చారు. మఠంపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, నాయకులు శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, రన్‌మియా, కోటయ్య, రాము పాల్గొన్నారు.

● పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం మండల కార్యదర్శి అనంతు ప్రకాశ్ అన్నారు. పాలకవీడు మండల కేంద్రంలో జరిగిన సీపీఎం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతం పేరిట, కులం పేరిట ప్రజల ఓట్లను చీల్చి మళ్లీ గద్దెనెక్కాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. బీజేపీతో కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకుని తన కుమార్తెను కాపాడుకోవడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అవినీతి బీఆర్ఎస్, మతోన్మాద బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో గుర్రం ధనమూర్తి, ఏసురత్నం, పురుషోత్తంరెడ్డి, మల్లారెడ్డి, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

●రూ.2 లక్షల విలువైన 30కార్టన్ల మద్యం స్వాధీనం

మేళ్లచెర్వు, ఏప్రిల్ 28: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి, 30కార్టన్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. చింతలపాలెం ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండల కేంద్రం నుంచి టాటా ఏస్ వాహనంలో రూ.2లక్షల విలువైన 30కార్టన్ల మద్యాన్ని ఏపీ రాష్ట్రం పిడుగురాళ్లకు తరలిస్తుండగా, శనివారం రాత్రి చింతలపాలెం శివారులో స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యాన్ని తరలిస్తున్న పిడుగురాళ్లకు చెందిన అంకిరెడ్డిని, ఆటోడ్రైవర్ నరేష్‌పై కేసు నమోదు చేసి, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లోవోల్టేజీతో కాలిపోతున్న గృహోపకరణాలు

అనంతగిరి, ఏప్రిల్ 28: విద్యుత్ లోవోల్టేజీతో మండలంలోని వసంతాపురం ఆవాసగ్రామం తెల్లబండ తండా గ్రామంలో గృహోపకరణాలు కాలిపోతున్నాయి. నెల రోజుల నుంచి గ్రామంలోని 20ఇళ్లలోని మోటార్లు, ఫ్యాన్లు, కూలర్లు, టీవీలు కాలిపోతున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ అధికారికి ఫోన్ ద్వారా తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. తెల్లబండా గ్రామంలో మూడు విద్యుత్ కాసారాలు ఉండగా, వాటిలో ఒకటి కాలిపోయిందని విద్యుత్ ఏఈ కీర్తి తెలిపారు. రెండు, మూడు రోజుల్లో కొత్త కాసారాన్ని ఏర్పాటు చేసి లోవోల్టేజ్ సమస్యను పరిష్కరిస్తామని ఏఈ తెలిపారు.

మేడే వేడుకలకు ఎన్నికల సంఘం అనుమతి

కోదాడ రూరల్, ఏప్రిల్ 28: మేడే వేడుకల కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున సభలు నిర్వహించడానికి వీలులేదని స్థానిక ఎన్నికల అధికారులు చెప్పారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వం ఎన్నికల కమిషన్‌ను సంప్రదించగా, మేడే వేడుకలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇచ్చిందన్నారు. మేడే ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు.

మేడేని విజయవంతం చేయాలి: సీఐటీయూ

మేడేని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ముత్యాలు కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాడవాడలా ఎర్రజెండాలు ఎగురవేసి ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మన్యం లింగయ్య, సత్తిరెడ్డి, వెంకన్న, సైదులు, నాగరాజు, శ్రీనివాస్, కొండలు తదితరులు పాల్గొన్నారు.

నూతన్‌కల్: మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు మూరగుండ్ల మధు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మేడే ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. శ్రామికులు తమ పనికి తగిన వేతనం కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో సైదులు, శ్రీను, వెంకన్న, ఉపేందర్, సురేష్ పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 28: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్య ధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

వర్షాలు కురవాలని బొడ్రాయికి పూజలు



ఆర్లెగూడెంలో బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

చిలుకూరు, ఏప్రిల్ 28: గ్రామాల్లో వర్షాలు సమృద్ధిగా కురవాలని, ఖరీఫ్‌లో పంటలు బాగా పండాలని కోరుతూ ఆదివారం మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో గ్రామస్థులు బొడ్రాయికి నీళ్లు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండల తీవ్రతను తట్టుకోలేకపో తున్నామని, వర్షాలు కురవాలని బొడ్రాయికి గ్రాముస్థులు మొక్కారు. ఈ సందర్భంగా బొడ్రాయికి జలాభిషేకం నిర్వహించారు.

సత్తెమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కోదాడ రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని యర్రవరం గ్రామంలో మాదిగ కులస్థుల ఆరాధ్య దైవం సత్తెమ్మ ఆలయ నిర్మాణానికి తాజా మాజీ సర్పంచ్ వీరేపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాషబోయిన భాస్కర్‌రావు, తన తల్లిదండ్రులు అనసూర్యమ్మ, జానకిరామయ్య జ్ఞాపకార్థం రూ.2లక్షలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కులపెద్దలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సూర్యాపేటలోని జడ్పీ హైస్కూల్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 28: సూర్యాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003-24పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులను సన్మానించారు.

● జిల్లా కేంద్రంలోని చైతన్య భారతి పాఠశాలకు చెందిన 1993-94 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సూర్యాపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. మృతిచెందిన తోటి విద్యార్థుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, జి.వెంకటేశ్వర్లు, నాగార్జున, శేఖర్, జానకిరాములు, ఆనంది, అమీనా, ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చైతన్య భారతి పాఠశాలలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



అథ్లెటిక్ మీట్‌లో మాట్లాడుతున్న మీలా మహదేవ్

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 28: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సుధాకర్ పీవీసీ పరిశ్రమల అధినేత మీలా మహదేవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్ప్రింట్స్ మిడిల్, లాంగ్ డిస్టెన్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ మీట్-2024 పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతగానో తోడ్పడుతాయని అన్నారు. క్రీడల్లో జయాపజయాలు సహజమని, ఓటమి నుంచి స్ఫూర్తి పొంది గెలుపును సొంతం చేసుకోవాలన్నారు. అండర్ 14, 16, 18, 20విభాగంలో 650మంది క్రీడాకారులు పోటీ పడటం అభినందనీమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్, అజాంబాబా, హనుమంతరావు, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, యాదయ్య, షైనయ్య, సైదులు, వెంకటేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 28: ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మాజీ మంత్రి, పీసీసీ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూరాపేటలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్)దామోదర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని అమలుచేస్తున్న కాంగ్రెస్ వెంటే ప్రజలంతా ఉన్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ ఓటర్లు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరారు. నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్‌కు ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులు కూడా దొరికే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, అంజద్‌అలీ, చింతమల్ల రమేష్, నాగులవాసు, ఆలేటి మాణిక్యం, నరేందర్‌నాయుడు, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.



సూర్యాపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్)

కాంగ్రెస్‌లోకి రావడం సంతోషంగా ఉంది



కాంగ్రెస్ నాయకులు జగ్గారెడ్డి, కోదండరెడ్డి, హనుమంతరావు సమక్షంలో రవిబాబు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 28: తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీలోకి రావడం సంతోషంగా ఉందని అనుములపురి రవిబాబు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ చేరికల కమిటీ సభ్యులు జగ్గారెడ్డి, కోదండరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం సైనికుడిలా పనిచేశానని, అదే సంకల్పంతో రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలి

నాగారం, ఏప్రిల్ 28: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని తుంగతుర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య అన్నారు. ఆదివారం నాగారం మండల కేంద్రంలో బూత్ నెం. 266లో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడతూ కేంద్రంలో నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. 400కు పైగా పార్లమెంట్ స్థానాలను బీజేపీ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. బీజేపీ బీసీ, ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని, మతపరమైన రిజర్వేషన్లకు మాత్రమే వ్యతిరేకమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచేయడంతో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకుడు బూర మల్సూర్‌గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మోల్కపురి చిరంజీవి, గ్రామశాఖ అధ్యక్షుడు వంగూరి మహేష్, బొబ్బిలి కిరణ్, ఆనంతుల సోమేష్‌గౌడ్, మంగదుడ్ల శివ, శంకర్, గణేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో ప్రచారం చేస్తున్న కడియం రామచంద్రయ్య

మండలంలో నేటి నుంచి కాంగ్రెస్ ప్రచారం

కోదాడ రూరల్, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి విజయం కోసం సోమవారం నుంచి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం గుడిబండ, రెండో తేదీన అల్వాలపురం, దొరకుంట, చిమిర్యాల, మంగళితండా, సాయంత్రం నల్లబండగూడెం, రెడ్లకుంట, మూడో తేదీన కూచిపూడి, కూచిపూడితండా, కాపుగల్లు, అడ్లూరు, సాయంత్రం తొగర్రాయి, యర్రవరం, గణపవరం, రామలక్ష్మీపురం, బీక్యాతండా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తామన్నారు.

'కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు తగవు'

నూతన్‌కల్, ఏప్రిల్ 28: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగవని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీపై, మంత్రి వెంకటరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు గణేష్, బద్రి, గంగయ్య, వెంకన్న, అశోక్, సింహాద్రి, కొమరెల్లి పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన బైక్: ఇద్దరికి తీవ్ర గాయాలు

మఠంపల్లి, ఏప్రిల్ 28: రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బక్కమంతుగూడెం శివారులో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన కంకణాల రాము, వీరస్వామి మఠంపల్లిలో తమ బంధువు గృహప్రవేశానికి సాయంత్రం వచ్చారు. స్వగ్రామానికి వెళుతూ ఎర్రగట్టు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో రాము, వీరస్వామికి తీవ్ర గాయాలయ్యాయి క్షతగ్రాతులను .108అంబులెన్సులో సిబ్బంది హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 28: అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అక్షర ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఏవీఎం పాఠశాలలో ప్రతి రోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి 11గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్ ఓరియంటేషన్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, కరాటే, డ్యాన్స్, కోలాటం, యోగా, ధ్యానం, కంప్యూటర్, వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఉప్పు నాగయ్య, చొల్లేటి ఉపేంద్రాచారి, దామోదర్‌రెడ్డి, కాళిదాసు, ఉపేందర్, అప్పారావు, నజీర్‌బాషా, తిరుమల్‌రెడ్డి, సుబాష్‌చంద్రబోస్, వీర్లపాటి వెంకన్న పాల్గొన్నారు.

స్థానిక హమాలీలకు పనులు కల్పించాలి

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 28: స్థానిక హమాలీలకు పనులు కల్పించాలని హమాలీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంపటి గురూజీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నవోదయ రైస్ మిల్లులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీహార్ రాష్ట్రం నుంచి ఇక్కడికి వచ్చిన హమాలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని,వారికి కూలి అతి తక్కువగా చెల్లిస్తున్నారని తెలిపారు. హమాలీలకు ప్రభుత్వం రూ.5లక్షల బీమా వర్తింపజేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హమాలీలు యాదగిరి, నాగు, లింగయ్య పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాపాడుకోవాలి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 28: కార్మికుల హక్కులు కాపాడుకోవాలని బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్ కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన హమాలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. . పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసే కుట్ర జరుగుతుందన్నారు. మేడేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీను, వెంకన్న, రామయ్య, సైదులు, బాలకృష్ణ, వీరబాబు, కోటేశ్వరరావు, నర్సింహారావు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే ఏపూరి ఫౌండేషన్ లక్ష్యం



వెలిశాల గ్రామంలో చెక్కు అందజేస్తున్న ఏపూరి సోమన్న

తిరుమలగిరి రూరల్, ఏప్రిల్ 28: పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా ఏపూరి ఫౌండేషన్ పనిచేస్తుందని ఫౌండేషన్ బాధ్యుడు ఏపూరి సోమన్న అన్నారు. మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన ఆలకుంట్ల శ్రీను అకాల మృతి చెందాడు. శ్రీను ఇద్దరు పిల్లలు ఇబ్బందుల్లో ఉన్నారని తెలుసుకుని, ఆ కుటుంబానికి రూ.50వేల చెక్కును అందజేసి మాట్లాడారు. శ్రీను పిల్లలను చదివించేయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎ.లింగన్న, ఎ.కృష్ణ, గిలకత్తుల రమేష్, ఎ.యాకన్న, మధు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తమ్మ మృతి బాధాకరం



ముత్తమ్మ సంతాపసభలో మాట్లాడుతున్న నాగన్నగౌడ్

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 28: మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికురాలు, కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ కస్తాల శ్రావణ్ తల్లి కస్తాల ముత్తమ్మ మృతి బాధాకరమని ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు యరగాని నాగన్నగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహిం చిన కస్తాల ముత్తమ్మ సంతాప సభలో మాట్లాడారు. అనంతరం ముత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి దొంగరి వెంకటేశ్వర్లు, గల్లా వెంకటేశ్వర్లు, మహేష్‌గౌడ్, చింతకాయల రాము, యోహాన్, సుదర్శన్, ఎల్లారెడ్డి, హరికృష్ణ, వెంకన్న, దిల్, శ్రీనివాస్, వెంకన్న, ముక్కంటి పాల్గొన్నారు.

నిబంధనల మేరకు నడుచుకోవాలి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 28: సెలూన్ షాపుల యజమానులు నిబంధనల మేరకు నడుచుకోవాలని నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు సురేష్, ఆవులపాటి శ్రీను, లక్ష్మణ్, కంచరకుంట్ల రవి కోరారు. ఆదివారం పట్టణంలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చేసిన ధర్నా అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.తమ యూనియన్ ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రడ్డిని కలిసి సమస్యలు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో హనుమంతరావు, ఉపేందర్, రవికుమార్, పిల్లుట్ల కృష్ణ, సైదులు, శ్రీనివాస్, పి.సుధాకర్, వెంకటేశ్వర్లు, రాము, శ్రీరాములు పాల్గొన్నారు.

వెంకటయ్య జీవితం ఆదర్శనీయం



వెంకటయ్య చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 28: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ జాతీయ నాయకుడు బొమ్మగాని వెంకటయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించినబొమ్మగాని వెంకటయ్య ప్రథమ వర్ధంతి సభలో వారు మాట్లాడారు. సూర్యాపేట కేంద్రంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ధర్మభిక్షం అడుగుజాడల్లో నడుస్తూ అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర వెంటకయ్యకు ఉందన్నారు. సభలో సీపీఐ నాయకులు గోదా శ్రీరాములు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కేవీఎల్, అనంతుల మల్లీశ్వరి, జుట్టుకొండ సత్యనారాయణ,, దంతాల రాంబాబు, దొరెపల్లి శంకర్, చామల అశోక్, బొమ్మగాని నాగభూషణం, శ్రీనివాస్, బూర వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి రాము, నిమ్మల ప్రభాకర్, గుడిపూడి వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ రామూర్తియాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.